సాక్షి అనకాపల్లి

ఆదివారం । 4 । జూన్ । 2023



నాలుగు వైపులా రాజగోపురాలు

చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో నిర్మించిన రాజగోపురాలకు ఆదివారం కలశ ప్రతిష్ట చేయనున్నారు. 10లో



అలరించిన తెలుగమ్మాయి

విశాఖ: తెలుగింటి సంప్రదాయ వస్త్రధారణతో తెలుగమ్మాయి మెగా ఫైనల్స్ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం ఘనంగా జరిగాయి.



వెంకన్న తెప్పోత్సవం

విశాఖ: పోర్టు వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం తెప్పోత్సవం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: జిల్లాలో అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఐసీడీఎస్ పీవో ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి డివిజన్‌లో 12, నర్సీపట్నం డివిజన్‌లో 13 ఖాళీలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ లోపు సంబంధిత శిశు అభివృద్ధి పథకపు అధికారిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా గాని, పోస్టు ద్వారా గాని దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ ఏడాది జులై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన, పోస్టు ఖాళీగా ఉన్న గ్రామంలో నివాసముంటున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్ణయించిన తేదీ నాడు జిల్లా స్థాయి ఎంపిక కమిటీ మౌఖిక పరీక్ష నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తుందన్నారు.

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా వెంకటరమణ



అనకాపల్లిటౌన్: జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా ఆర్. వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖ జిల్లా పెదగంట్యాడలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మణస్వామి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

హిందీ పరీక్షకు 819 మంది హాజరు

అనకాపల్లి టౌన్: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లాలో హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. 1058 మంది విద్యార్థులకు గాను 819 మంది హాజరుకాగా 239 మంది గైర్హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, టెక్నాలజీలో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల నిర్వహిస్తున్న ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తత్సమాన విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు. మొత్తం 40 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 4 సీట్లు భర్తీ చేస్తారు. కోర్సు ఫీజు రూ.65,000. సెల్ఫ్ సపోర్ట్ విధానంలో కోర్సును నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 12లోగా http://audoa.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని.. పూర్తి చేసి పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలి. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తుతో పాటు రూ.2000 డి.డిని రిజిస్ట్రార్, ఏయూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–అడ్మిషన్ అకౌంట్ పేరుతో చెల్లించాలి. కౌన్సెలింగ్ సమయంలో అదనంగా రూ.600 చెల్లించాల్సి ఉంటుందని ఆచార్య నాయుడు తెలిపారు.

విశాఖ పోర్టుకు సేఫ్టీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న పోర్టు అధికారులు

మహారాణిపేట: సేఫ్టీ ఎక్సలెన్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు విశాఖ పోర్టు అథారిటీని అవార్డు వరించింది. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గ్రీన్ టెక్ ఫౌండేషన్ సంస్థ న్యూఢిల్లీలో శనివారం నిర్వహించింది. సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల భద్రత, సంస్థ పురోగతికి, ప్రమాదాలు ఘటనలను సమర్థవంతంగా నిరోధించేందుకు చేపట్టిన చర్యలు పరిశీలించి ఏటా గ్రీన్ టెక్ సంస్థ అవార్డులను ప్రదానం చేస్తుంది. పోర్టు డిప్యూటీ సీఎంఈ రవికుమార్. సేఫ్టీ అధికారులు గ్రీన్ టెక్ అవార్డును స్వీకరించారు.

ఆధ్యాత్మిక శోభ

- రాజుపాలెంలో ప్రత్యక్ష నారాయణుడికి ప్రణతులు
- వైభవంగా మహాలక్ష్మీసమేత వైకుంఠనారాయణ, వేంకటేశ్వర, లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్టాపన
- వేంపాడులో భగవద్ రామానుజుల విగ్రహావిష్కరణ



స్వామీజీతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహాలక్ష్మి సమేత వైకుంఠనారాయణ విగ్రహ ప్రతిష్టాపన చేస్తున్న చినజీయర్‌స్వామి

అనకాపల్లి టౌన్: రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ఆధ్యాత్మిక శోభ తాండవించింది. మహాలక్ష్మీసమేత వైకుంఠనారాయణ, వేంకటేశ్వర, లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్టాపన వైభవోపేతంగా జరిగింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి హాజరు కావడంతో భక్తులు పరవశించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య చినజీయర్‌స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్టాపన నేత్రపర్వంగా జరిగింది. ధ్వజస్తంభాన్ని కూడా ప్రతిష్ఠించి, స్వామీజీ ఆలయ ఆవరణలో పాలూరు సూర్యప్రకాష్ ఫంక్షన్ హాలును ప్రారంభించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామిజీ ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావును బంగారు కంకణంతో సత్కరించారు. విగ్రహాల శిల్పులు పరమేష్, గోపీ, రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్, గొల్లవిల్లి నర్సింగరావు, బండారు వేంకటరమణ, గొల్లవిల్లి చిరంజీవి, జి.రామకోటి, గోపిశెట్టి వరహాలు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామి

ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుడు ఆరోగ్య ప్రదాత అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సూర్యదేవుడి విశిష్టతను వివరించారు. స్వామివారి తల్లిదండ్రులు కశ్యప ప్రజాపతి, అదితి. అదితి సంతానమంతా దేవతలే. అయితే ఆమెకు సూర్యనారాయణుడంటేనే ప్రీతి. అందుకే ఆయనకు ఆదిత్యుడన్న పేరు వచ్చింది. సమస్త జీవులను కార్యకలాపాలవైపు మళ్లించే శక్తి ఒక్క సూర్యనారాయణస్వామికి మాత్రమే ఉంది. ఏ పూజ చేసినా... ఏ నోము నోచినా సూర్యనారాయణస్వామి వంక చూస్తూ చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు.

భగవంతుడి దృష్టిలో మనుషులంతా ఒక్కటే

నక్కపల్లి: భగవంతుడి దృష్టిలో మనుషులంతా ఒక్కటేనని, చిన్న పెద్ద, పొట్టి పొడుగు, తెలుపు, నలుపులను బట్టి తేడా ఉండదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. శనివారం ఆయన వేంపాడులో వికాసతరంగిణి ఏర్పాటు చేసిన భగవద్ రామానుజుల వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. రామానుజుల వారంటే సమతామూర్తి అన్నారు. వారి దృష్టిలో అందరూ సమానం కావడంతో అలా పిలుచుకుంటున్నామన్నారు. భగవంతుడి దృష్టిలో కోటీశ్వరుడు, పేదవాడు ఒక్కటేనన్నారు. ఈ విషయాన్ని ప్రపంచ మానవాళికి చాటి చెప్పిన రామానుజుల వారి విగ్రహాన్ని వేంపాడులో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సురేష్‌రాజు, అప్పలరాజు, చినపేర్రాజు, ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.



వేంపాడులో రామానుజుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి

గోకివాడలో కలెక్టర్

నాడు–నేడు పనులు, అంగన్‌వాడీ, సంపద తయారీ కేంద్రాల పరిశీలన



గోకివాడలో కొబ్బరి మొక్క నాటుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రాంబిల్లి: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శనివారం గోకివాడలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. సంపద తయారీ కేంద్రాన్ని లక్ష్యం మేరకు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెరువును పరిశీలించారు. చెరువు, సంపద తయారీ కేంద్రాల వద్ద కొబ్బరి మొక్కలు నాటారు. నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరానికి ఆటంకం కలగకుండా శ్లాబ్ శిథిలమైన రెండు భవనాలను రీ మోడల్ చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించి పనులు పూర్తిచేయాలన్నారు. కలెక్టర్ పర్యటనలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు, సర్పంచ్ నీరుకొండ శారద, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు బాబ్జి, పాల సంఘం అధ్యక్షుడు నందవరకు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల పనుల పరిశీలన



కళాశాల నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

మాకవరపాలెం: వైద్య కళాశాల నిర్మాణంతో అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయని అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద రూ.500 కోట్లతో 52 ఎకరాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న వైద్య కళాశాల పనులను ఎంపీ సత్యవతి శనివారం పరిశీలించారు. 620 పడకలతో నిర్మిస్తున్న ఈ కళాశాలకు సంబంధించిన వివరాలను ఏపీఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధికంగా నిధులు వెచ్చిస్తోందని చెప్పారు. ప్రజలకు వైద్యాన్ని చేరువచేయడమే లక్ష్యంగా నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాలను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కళాశాల పూర్తయితే వేలాది మందికి మెరుగైన వైద్య సేవలు సత్వరమే అందుతాయన్నారు. ఆమె వెంట ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భద్రాచలం, గోవిందరావు, చిటికెల రమణ తదితరులున్నారు.

ఉచిత మహాప్రస్థాన వాహన సేవలు

యలమంచిలిలో రూ.11 లక్షలతో సిద్ధం 10లో

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

ఏయూక్యాంపస్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

తాగునీటి సౌకర్యం కల్పించారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులు తనిఖీ చేసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి డిజిటల్ పరికరాలను అనుమతించలేదు. తొలి రోజు జరిగిన తెలుగు పరీక్ష బాగా రాశామని అభ్యర్థులు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

నేటి నుంచి మహిళా టీ20



మాట్లాడుతున్న వుమెన్ టీ20 బ్రాండ్ అంబాసిడర్ రష్మీగౌతమ్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ మహిళా టీ 20 లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 11వ తేదీ వరకు విజయనగరంలోని నార్త్‌జోన్ అకాడమీతోపాటు వైఎస్సార్ స్టేడియం(ఫైనల్స్)లో జరగనున్న ఈ పోటీల్లో నాలుగు మహిళా జట్లు పాల్గొననున్నాయి. శనివారం వైఎస్సార్ స్టేడియంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపినాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గతేడాది మహిళా టీ20 లీగ్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించామన్నారు. ఈ లీగ్‌లో సత్తాచాటిన నలుగురు మహిళా క్రీడాకారిణులు ఇండియన్ వుమెన్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. మరోసారి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ మ్యాచ్‌లను డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుందన్నారు. ఏసీఏ సీఈఓ శివారెడ్డి మాట్లాడుతూ ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి పర్యవేక్షణలో ఏపీలో క్రికెట్ గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఏసీఏ వుమెన్ టీ20 బ్రాండ్ అంబాసిడర్ రష్మీగౌతమ్ మాట్లాడుతూ ఏపీలో మహిళా క్రికెట్‌కు ఏసీఏ ప్రోత్సాహం చాలా బాగుందన్నారు. గతేడాది నిర్వహించిన ఈ లీగ్ నుంచి నలుగురు క్రీడాకారిణులు వుమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఆడే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్, విజయనగరం రాయల్స్‌తో పాటు వైజాగ్ డాల్ఫిన్స్ తరపున ఆడేందుకు స్థానిక క్రీడాకారిణులు సమాయత్తమవుతున్నారు. ఈ సీజన్‌లో మరింత మంది వుమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఆడేందుకు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

అనుక్షణం.. అప్రమత్తం

- కోరమండల్‌లో 309 మంది, యశ్వంత్‌పూర్‌లో 33 మంది ప్రయాణం
- కోరమండల్‌లో 183 మంది, యశ్వంత్‌పూర్‌లో 21 మంది సురక్షితం
- ఇప్పటికే విశాఖ చేరుకున్న 41 మంది ప్రయాణికులు
- ఇద్దరు క్షతగాత్రులకు సెవెన్‌హిల్స్‌లో చికిత్స
- ఇంకా లభించని 63 మంది ఆచూకీ
- వారి వివరాల సేకరణలో అధికార యంత్రాంగం తలమునకలు



విశాఖ చేరుకున్న క్షతగాత్రులు



రైళ్లు రద్దు కావడంతో విశాఖ రైల్వే స్టేషన్లో వేచి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: ఊహకందని ఘోరం.. మాటలకందని విషాదం.. కళ్లుమూసి తెరిచేలోపు.. క్షణాల్లో వందల మంది ప్రయాణికులు మృత్యు ఒడికి చేరుకున్నారు. రైలు ప్రయాణంలోనే శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఒడిశాలోని బహనగా బజార్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో విశాఖకు చెందిన వారు కూడా చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విశాఖపట్నం ప్రాంతానికి చెందిన వారి వివరాలను సేకరించాలని కలెక్టర్ డా.మల్లికార్జునను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి డీఆర్వో శ్రీనివాసమూర్తికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కోరమండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన విశాఖ జిల్లాకు చెందిన వారి వివరాలను సేకరించారు. ప్రమాదానికి గురైన రెండు రైళ్లలో రిజర్వేషన్ బోగీల్లో విశాఖపట్నం స్టేషన్ నుంచి రైలు ఎక్కిన వారు, విశాఖలో రైలు దిగాల్సిన ప్రయాణికులు మొత్తం 342 మంది ఉన్నట్లుగా గుర్తించారు. 10 మంది కంట్రోల్ రూమ్ బృందం.. ప్రయాణికుల ఫోన్ నంబర్లకు కాల్ చేసి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటోంది. కోరమండల్ రైలులో 309 మంది ప్రయాణికులుండగా, హౌరాలో 33 మంది ఉన్నారు. వీరిలో 279 మంది వివరాలు తెలియగా.. మిగిలిన 63 మంది ఫోన్లు కలవకపోవడం, లిఫ్ట్ చేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు తెలియజేయండి

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి.. 0891–2590100, 0891–2590102తో పాటు వాట్సప్ నంబర్‌గా 91544 05292ను అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల సమాచారం కోసం కుటుంబ సభ్యులెవరైనా ఈ నంబర్లకు కాల్ చేసి వివరాలు అందిస్తే.తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. అత్యవసర సేవల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచామని.. మెడికల్ ఎమర్జెన్సీ కోసం ముందుస్తుగా ప్రధాన ఆస్పత్రుల్లో పడకలను కూడా రిజర్వ్ చేశామన్నారు.

మరోవైపు ప్రమాదంలో సురక్షితంగా బయటపడిన వారు, స్వల్ప గాయాల పాలై ప్రాథమిక చికిత్స తీసుకున్న వారిని స్వస్థలాలకు తరలించేందుకు చెన్నై వరకు ప్రత్యేక రైలు బయలుదేరింది. ఈ రైలులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 41 మంది శనివారం సాయంత్రం విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరిలో ఇద్దరు ప్రయాణికులను చికిత్స కోసం సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పనుకువలసకు చెందిన లోకేష్, ఆయన భార్య మిన్నీగా గుర్తించారు. వివరాలు తెలిసిన ప్రయాణికులను విశాఖకు తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లపై రైల్వే, ఒడిశా ప్రభుత్వ అధికారులతో జిల్లా అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు.

అనకాపల్లిలో కంట్రోల్ రూమ్

కాల్ 08924–222888

తుమ్మపాల: ఒడిశా రైలు ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులకు సంబంధించిన సమాచారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ఈ ప్రమాదంలో జిల్లాకు చెందినవారెవరైనా ఉంటే కుటుంబ సభ్యులు తమను సంప్రదించాలన్నారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. 08924–222888కు కాల్ చేస్తే జిల్లా యంత్రాంగం తగిన సహాయం అందిస్తుందన్నారు.

91544 05292

- ఆచూకీ తెలియకపోతే ఫొటో పై నంబర్‌కు వాట్సప్ చేయండి
- ప్రయాణికుల వివరాలు సేకరిస్తాం
- విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: గుట్టలుగా మృతదేహాలు ఉండటం, ప్రమాదం సంభవించి 24 గంటలకు పైగా గడిచిపోవడంతో.. మృత్యుఒడికి చేరుకున్న ప్రయాణికులను గుర్తించడం కష్టసాధ్యంగా మారింది. ప్రయాణికుల జేబుల్లో ఉన్న ఆధార్ కార్డులు, ఫోన్లు, టికెట్లు... ఇలా ఉన్న వాటితో కొందరిని గుర్తించారు. మిగిలిన వారి మృతదేహాలు ఛిద్రంగా మారడంతో వారిని గుర్తించడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి చాలామంది ఆచూకీ ఇంకా లభించలేదు. వారంతా క్షేమంగా ఉన్నారా లేదా..? ఎక్కడ ఉన్నారు.. ఏదైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారా? మొదలైన వివరాలను సేకరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రమాదంలో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కనుగొనేందుకు కుటుంబ సభ్యులెవరైనా.. 91544 05292కు వారి ఫొటో, పేరు, ఇతర వివరాలు పంపించాలని కలెక్టర్ డా.మల్లికార్జున సూచించారు. ఫొటో, వివరాలను విజయవాడ, ఒడిశా రైల్వే అధికారులు, ప్రభుత్వాధికారులకు పంపిస్తామన్నారు. వాటి ఆధారంగా.. వారు ఎక్కడ ఉన్నారు.. ఎలా ఉన్నారనే వివరాలను సేకరించడం సులభమవుతుందన్నారు. ప్రస్తుత సమాచారం మేరకు విశాఖకు చెందిన ప్రయాణికులు దాదాపు క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ నిర్మాణ పనులు అడ్డుకున్న ఆరుగురిపై కేసు

మునగపాక : అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను అడ్డుకున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. మునగపాక బీసీ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణం చేపట్టేందుకు ఐసీడీఎస్ చర్యలు తీసుకుంది. అయితే అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం తగదంటూ కాలనీవాసులు అడ్డుతగలడంతో వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలనీకి చెందిన ఆరుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'నర్సీపట్నంలో ఐటీడీఏ స్పందన నిర్వహించాలి'

రావికమతం: నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ మూడో జిల్లా మహాసభ శనివారం రావికమతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో తొమ్మిది మండలాల్లో 261 గిరిజన గ్రామాలు ఐటీడీఏలో విలీనం కాక ప్రభుత్వ ఫలాలను అందుకోలేకపోతున్నారని వాపోయారు. ఇక్కడి గిరిజనుల సమస్యలను స్పందనలో ఐటీడీఏ పీవోకు వివరించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లి కేంద్రాలుగా స్పందన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, తోకల అప్పారావు, బూరిగ నాగరత్నం పాల్గొన్నారు.

వ్యక్తిపై కిడ్నాప్, అట్రాసిటీ కేసు

అచ్యుతాపురం (అనకాపల్లి): బాలికను మాయమాటలు చెప్పిన తీసుకువెళ్లిన వ్యక్తిపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి దిశ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు చెప్పారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న బాలిక కనిపించడం లేదంటూ బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్టు డీఎస్పీ చెప్పారు. బాలిక మేనమామ అయిన మజ్జి గిరిబాబు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉంటాడని బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి గిరిబాబును అదుపులోకి తీసుకొని బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు.

నాలుగు వైపులా రాజగోపురాలు

- శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి కొత్త శోభ
- నేటి నుంచి రాజగోపురాల కలశ ప్రతిష్ట మహోత్సవం


స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా నిర్మించిన రాజగోపురం (ఇన్‌సెట్) మూలవిరాట్

చోడవరం: కాణిపాకం తర్వాత అంతటి ప్రాముఖ్యత ఉన్న స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి ఇప్పటికే ఒక వైపు రాజగోపురం ఉండగా మిగతా మూడు వైపులా నిర్మిస్తుండడంతో కొత్తశోభ సంతరించుకుంది. సుమారు రూ.3కోట్లకు పైనే ఖర్చుచేసి రాజగోపురాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన తూర్పు, పశ్చిమ రాజగోపురాలను ఆదివారం ప్రారంభించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాజగోపురాల కలశ ప్రతిష్ఠాపనమహోత్సవాలు నిర్వహించనున్నారు. దేవీదేవతల విగ్రహాలను రాజగోపురాలపై నెలకొల్పారు. వీటికి ప్రధాన ముఖ ద్వారబంధాలు కూడా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. ఉత్తర దిక్కున చేపట్టిన రాజగోపురం నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోంది. ఆలయానికి నాలుగుపక్కలా రాజగోపురాలు ఏర్పాటవడంతో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా తయారైంది. కలశ ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పూజా కార్యక్రమాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభిస్తారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు ఆలయ ప్రధానఅర్చకుడు కొడమంచిలి చలపతిరావు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్ పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత మహాప్రస్థాన వాహన సేవలు

యలమంచిలిలో రూ.11 లక్షలతో సిద్ధం


అంతిమయాత్ర రథాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, వైస్ చైర్మన్లు

యలమంచిలి: నిరుపేదలు మరణిస్తే జీవిత చివర మజిలీలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతిమ యాత్రకు కావలసిన పాడె సామగ్రి కొనుగోలు చేయడం కష్టతరమవుతోంది. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా తుది వీడ్కోలు ఘనంగా పలికేందుకు మహాప్రస్థాన వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. దీన్ని రూ. 11 లక్షలతో యలమంచిలి మున్సిపల్ అధికారులు కొనుగోలు చేశారు. దీని కొనుగోలుకు చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తన తండ్రి స్వర్గీయ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థంగా కొంతమొత్తం, పట్టణ పురప్రజల ఆర్థిక సాయం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ రథాన్ని చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో అభాగ్యులు, నిరుపేదలు ఎవరైనా మరణిస్తే వారిని శ్మశానవాటిక వరకు ఎటువంటి ఖర్చు లేకుండా పార్థివ దేహాలను తరలించటం కోసం అంతిమ యాత్ర వాహనం ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పుర ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, డాక్టర్ త్రినాథ్, రాపేటి సంతోష్, మరిణేశ్వరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, డీఈ వీరయ్య, మేనేజరు ప్రభాకరరావు, టీపీవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఏడుగురు క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులు

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు నింజాస్ అకాడమికి చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు టీమ్ కోచ్ ప్రియాంక తెలిపారు. విజయనగరం జిల్లా కొత్తవలస ఇండోర్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ పోటీల్లో బి.ఎస్.మణికంఠ, పి.ప్రణీత్, ఎం.ప్రేమ్ విఘ్నేష్, బబ్బులు, పి.శిరిష, పి.భాను, బి.నవదీప్ పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని నింజాస్ అకాడమి చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు.

అల్లూరి నడియాడిన ప్రాంతాలు అభివృద్ధి చేస్తాం

ఏఎల్‌పురంలో ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


కమ్యూనిటీ భవనం పనులు ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడియాడిన ఏఎల్‌పురం(కృష్ణదేవిపేట) గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, దీని కోసం ప్రణాళిక రూపొందించామని అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి తెలిపారు. మండలంలోని ఏఎల్‌పురం (కృష్ణదేవిపేట) ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శనివారం ఆమె నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ నిధులతో ఈ ప్రాంతంలో కమ్యూనిటీ భవనాలతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అల్లూరి నడియాడిన ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. ఏఎల్‌పురంలో పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ, ఎంపీ నిధులతోపాటు ఇతర నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు ఇటీవల కలెక్టర్‌తో చర్చించామన్నారు. ప్రధానంగా ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానన్నారు. డ్రైనేజీ, సీసీరోడ్లు, ప్రధాన రోడ్లు, అల్లూరి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ లోచల సుజాత, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, నర్సీపట్నం పీఆర్‌డీ ఈఈ ప్రసాద్, తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా నాటికలు


రైతే రాజు నాటికలో సన్నివేశం

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో హైదరాబాద్ వై.కె.నాగేశ్వరరావు నాటక పరిషత్, క్లబ్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికలు రెండో రోజైన శనివారం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

రైతు ప్రాముఖ్యం చాటి చెప్పే 'రైతే రాజు'

దేశం వెలుపల జవాన్... దేశం లోపల కిసాన్.. వీళ్ల లేకపోతే ప్రజలు సుఖంగా బతకడంకష్టం. ఈరోజు టెక్నాలజీ పెరిగిపోయింది. పిడికెడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్ని శాసిస్తున్నారు....సెల్‌ఫోన్ లేకపోయినా బతకొచ్చు.. కానీ రైతు పండించే పిడికెడంత అన్నం తినకుండా ఈ భూమ్మీద ఎవరూ బతకలేరు అటువంటి రైతును ప్రజాప్రతినిధులు, ప్రజలు పట్టించుకోని సమస్యే 'రైతే రాజు' నాటిక ఇతివృత్తం. హైదరాబాద్ కళాంజలి వారు ప్రదర్శించిన ఈ నాటికకు రచన కంచర్ల సూర్యప్రకాష్, దర్శకత్వం కొల్లా రాధాకృష్ణ అందించారు.

ప్రపంచీకరణకు 'అతీతం'గా...

ఒక తరం మంచో చెడో గ్లోబలైజేషన్‌ను ఆహ్వానించింది. ఫలితం ఏ వర్గం సుఖంగా లేదు. తాత్కాలిక ఆనందం, జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నామన్న భ్రమలు. జీవితం గడుస్తున్న కొద్దీ అంతా సజావుగానే ఉంటుంది. మానవ సంబంధాలన్నీ మామూలుగానే కనపడతాయి. కానీ నిశ్శబ్ద హింస! మనకు తెలియకుండానే బానిసత్వపు జాడలు ! మనిషిని మనిషి మర్చిపోయేలా చేస్తున్న వింత జబ్బు ఈ ప్రపంచీకరణ. దీనికి ఎదురుతిరిగి ఈ తరం యువతరం అసలైన ప్రపంచీకరణకు అర్థం చెప్పి ఈ దేశాన్ని, సమాజాన్ని, భారతీయ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడానికి చేస్తున్న ఓ అతీతమైన నాటక దృశ్యమే 'అతీతం' నాటిక ఇతివృత్తం. గుంటూరు అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన ఈ నాటికకు కథ శ్రీరామచంద్రమూళి, దర్శకత్వం ఎస్.రవీంద్ర రెడ్డి అందించారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వృద్ధుల సమావేశం రేపు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం వి.వి.రమణ రైతుభారతి హాలులో ఈనెల 5న వృద్ధుల సంక్షేమసంఘం సమావేశం నిర్వహించనున్నట్టు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వృద్ధుల నుంచి సలహాలు, సూచనలు తెలుసుకోవడంతో పాటు గుర్తింపుకార్డులు పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ శిక్షణ సంస్థ సందర్శన

అనకాపల్లిటౌన్: స్థానిక స్టేట్‌బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ కృష్ణశర్మ శనివారం సందర్శించారు.

సంస్థ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్ శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మతల్లి పండగ

మునగపాక : మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు చెరువుకాలువ సంఘ సభ్యులు తెలిపారు. ఏటా జూన్ మొదటి ఆదివారం ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

కామాక్షి దేవి కల్యాణం ..

మునగపాక : నాగులాపల్లిలో ఆదివారం కామాక్షిదేవి అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అమ్మవారి కల్యాణ మహోత్సవానికి భక్తులు తరలిరావాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పనకు కృషి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. హౌసింగ్ డే లో భాగంగా శనివారం మునగపాక లే–అవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం కొండమ్మ, తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మిపాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 80 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	4,050	4,600
మూడో రకం	3,650	4,000

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
అహింస	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్డిసాయి
చక్రవ్యూహమ్	: వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 18 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-6 యూనిట్లు, బి పాజిటివ్-2 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 257 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

మూగజీవాలు విలవిల

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బకు గురవుతున్న పశువులు
- తగ్గిన పాల దిగుబడి

నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు, మేకలు
అనకాపల్లి	8,748	13,676	10,200
కశింకోట	7,096	10,348	14,524



చెట్ల కింద సేద తీరుతున్న పశువులు

తుమ్మపాల: రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మనుషులకే కాదు మూగజీవాలకూ ప్రమాదకరంగా మారుతున్నాయి. భానుడి భగభగలకు పశువులు విలవిలలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మండుతున్న ఎండలు, వడగాడ్పుల కారణంగా పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. నియోజకవర్గంలో అనకాపల్లి, కశింకోట మండలాల్లో పెద్ద ఎత్తున్న పశువులను పెంచుతున్నారు.

చెట్లకిందే ఆశ్రయం

గ్రామాల్లో రైతులు వ్యవసాయంతో పాటు పాడి ద్వారా ఆదాయం పొందుతున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా పశువులకు నీడ అందించే షెడ్డుల నిర్మాణం చేయలేని పరిస్థితి. దీంతో పశువులను కల్లాల వద్ద చెట్ల కిందనే ఉంచుతున్నారు. ఉష్ణోగ్రతలకు పెరగడంతో ఎండతాపం నుంచి పశువులను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొంత మంది పెద్ద రైతులు మాత్రమే కొట్టాలను ఏర్పాటుచేసుకుని పశువులకు నీడ కల్పిస్తున్నారు. మిగిలిన రైతులు పశువులను చెట్ల కిందే కడుతున్నారు.

తగ్గిన పాల దిగుబడి

తీవ్ర ఎండలతో పాటు వడగాల్పులకు పశువులు నీరసించిపోవడంతో పాలదిగుబడి తగ్గిపోయింది. చెరువులు ఎండిపోవడంతో పశువులను తాగు నీరు కూడా అందించడం కష్టమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి మండలంలో కోడూరు, కొండుపాలెం, రేబాక, మామిడిపాలెం, అక్కిరెడ్డిపాలెం, సంపతిపురం, పాపయ్యపాలెం తదితర గ్రామాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో పశువులకు నీరందించేందుకు రైతులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



ఎండ, వడగాడ్పుల నుంచి పశువులకు రక్షణ కల్పించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. షెడ్లు ఏర్పాటు చేశాం. ఎండల కారణంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గింది.

– మంత్రి నానాజీ, రైతు.

తరచూ నీరు పెట్టాలి



వేసవి తీవ్రత తగ్గే వరకూ పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఉదయం పూట మాత్రమే ఆరుబయటకు మేతకు తీసుకువెళ్లాలి. ఎక్కువ సేపు ఎండ తగలకుండా చర్యలు తీసుకోవాలి. పశువులకు ఎక్కువ సార్లు నీరు పెట్టాలి. తరచూ నీటితో కడుగుతూ ఉండాలి. సాధ్యమైనంతవరకు చల్లని ప్రదేశంలో వాటిని ఉంచాలి.

– డాక్టర్ శ్యామల, పశువైద్యాధికారి,అనకాపల్లి

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

తుమ్మపాల: వేసవి తీవ్రత దృష్ట్యా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు తెలిపారు. పట్టణంలో నర్సింగరావుపేటలో విద్యుత్ శాఖ ఏర్పాటుచేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అన్ని ప్రాంతాల్లోను నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడంపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పట్టణంలో ఎక్కడా లోటల్టేజ్ సమస్య లేకుండా చూడా లని అధికారులను ఆదేశించారని చెప్పారు. 82వ వార్డు పరిధిలో 19 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అదనపు డీటీఆర్ కేంద్రాన్ని కూడా ఏర్పాటుచేసినట్టు చెప్పారు. అంతకు ముందు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు టోపీలు పంపిణీ చేశారు. విద్యుత్ శాఖ ఏఈ ఎం.శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ పేరపు రాంబాబు, కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా రాంజీ, కోన ఉమా, బల్రెడ్డి నూకరాజు, ఈ.శివ, డొంక సత్తిబాబు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



కశింకోటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

కశింకోట: సూర్యుడు నిప్పులు చెరుగుతుండడంతో ప్రజలకు అవస్థలకు గురవుతున్నారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ,ఉక్కపోత, వడగాడ్పులు అధికంగా ఉన్నాయి.ఎండ వేడిమిని భరించలేక ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఎవరూ సాహసించలేదు. ప్రధాన రోడ్లు జన సంచారం లేక వెలవెలబోయాయి. రాత్రి అయినా వేడి తగ్గలేదు. వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కూడా ఇలాగే ఉష్ణోగ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది



సైకిల్ తొక్కడం పై అవగాహన కల్పిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సీ డాక్టర్లు,సిబ్బంది

కశింకోట: రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధుల నివారణకు ప్రతి రోజూ సైక్లింగ్ చేయాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని జరిపారు. ఈసందర్భంగా సైకిళ్లు తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధులను అదుపులో ఉంచేందుకు సైక్లింగ్ దోహదపడుతుందన్నారు. మరో వైద్యాధికారి యశోద మాట్లాడుతూ నిత్యం సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు సత్యనారాయణ, మురళీకృష్ణ, సత్యవతి, ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి, ప్రకాష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ అత్యుత్తమ వ్యాయామం

అనకాపల్లి రూరల్: సైకిల్ తొక్కడం మంచి వ్యాయామమని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.వాణీ జగదీశ్వరి తెలిపారు. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా శనివారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆస్పత్రి డాక్టర్లు,సిబ్బంది.. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా సైకిల్ తొక్కితే గుండె జబ్బులు దరిచేరవని సూచించారు. గ్రామంలో కొందరు పిల్లలతో సైకిల్ తొక్కించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు డి. శారద,సీహెచ్‌వో జె.శ్రీనివాసరావు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు తెరవకముందే విద్యా దీవెన కిట్లు సిద్ధం



మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

ఎస్.రాయవరం : పాఠశాలలు తెరవక ముందే పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యాదీవెన కిట్లు ఆయా పాఠశాలలో సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి అన్నారు. మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు వచ్చిన పాఠ్య పస్తకాలను పరిశీలించారు. 60 వేలు పుస్తకాలు రావాల్సి ఉండగా 40 వేలు వచ్చాయని, మిగిలినవి మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. అనంతరం జేవీడీ కిట్ నమూనాను పరిశీలించారు. అనంతరం హౌసింగ్ డే పురస్కరించుకుని పెనుగొల్లు గ్రామంలో జగనన్న కాలనీని ప్రత్యేకాధికారి సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న తక్షణమే బిల్లు విడుదల అవుతున్నాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలన్నారు.

అభివృద్ధి పనులు చురుగ్గా జరగాలి

పాయకరావుపేట: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మాణాలు చురుగ్గా జరిగేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి సీహెచ్. లచ్చన్న అన్నారు. ఆయన శనివారం నామవరం గ్రామం వద్ద జగనన్న కాలనీని పరిశీలించారు. జగనన్న లే అవుట్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

రక్షణగా ఎస్‌బీఐ బీమా పథకాలు



మాట్లాడుతున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ కృష్ణశర్మ

కశింకోట: ఎస్‌బీఐ ద్వారా మూడు రకాల బీమా పథకాలను అమలు చేస్తున్నామని, ఇవి కుటుంబాలకు రక్షణగా నిలుస్తాయని బ్యాంకు అమరావతి ప్రాంత జనరల్ మేనేజర్ కృష్ణశర్మ అన్నారు. మండలంలోని నూతలగుంటపాలెంలో యలమంచిలి ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియంతో బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నామన్నారు. దీనివల్ల బీమాదారుడు ఏ విధంగా మృతి చెందినా నామినీకి రూ.2 లక్షల పరిహారం అందజేస్తారని చెప్పారు. 18 నుంచి 50 ఏళ్లు లోపు వయస్సు ఉన్న వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 చొప్పున చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారాన్ని అందిస్తారన్నారు. 18 నుంచి రూ.70 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి వర్తిస్తుందని చెప్పారు. వయస్సు రీత్యా అర్హత ఉన్న వారు ఈ రెండు బీమా పథకాల్లోనూ చేరవచ్చునన్నారు. దీనివల్ల రెండు పథకాల ద్వారా రూ.4 లక్షలు బీమా పరిహారం పొందవచ్చని చెప్పారు. పదేళ్ల లోపు బాలికలు ఉన్న వారు సుకన్య సమృద్ధి యోజన కింద నెలకు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు చెల్లిస్తే 18 ఏళ్ల వయస్సు వచ్చేటప్పటికి 8 శాతం వడ్డీతో కలిపి మొత్తం సొమ్ము అందజేస్తామని చెప్పారు.

రుణాలు సద్వినియోగం

కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) కింద విరివిగా రైతులుకు రుణాలు అందజేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జీఎం శర్మ కోరారు. ముద్ర, ఇతర రుణాలను అర్హులకు అందిస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.సురేష్‌ప్రభు మాట్లాడుతూ గ్రామాల్లో తమ శాఖలు లేనిచోట్ల కస్టమర్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత సేవలందిస్తున్నామన్నారు. అనకాపల్లి ఎల్‌డీఎం కె.సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంకు సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారి సేవలను వినియోగించుకుని బీమా పథకాల్లో చేరాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డయిజ మాట్లాడుతూ బీమా వంటి పథకాలలో చేరకపోవడం వల్ల కరోనా సమయంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆసరా కలిగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్‌బీఐ అనకాపల్లి రీజనల్ మేనేజర్ కె.జగదీశ్వరరావు,డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ ధర్మారావు, యలమంచిలి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ జి.రవికుమార్, ఫీల్డు ఆఫీసర్ వందన, వెలుగు పథకం ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కలిగెట్ల నాయుడు, సోమిరెడ్డి గోవింద, ఉప సర్పంచ్ యలమంచిలి మారీషు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నగ్నేశ్వర, బాలాత్రిపురసుందరి దేవి కల్యాణం



బాలాత్రిపురసుందరి సమేత నగ్నేశ్వరస్వామి

రాంబిల్లి: మండలంలోని దిమిలిలో శ్రీ బాలా త్రిపురసుందరి సమేత నగ్నేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం రాత్రి కనులపండువలా నిర్వహించారు. చారిత్రక నగ్నేశ్వర స్వామి ఆలయంలో ఈ కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మారుతీశర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహించిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు దిమిలి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలిచ్చారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం



కన్నూరుపాలెంలో వైఎస్సార్ జగనన్న కాలనీ పరిశీలిస్తున్న రోజారాణి



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: మండలంలోని సత్యనారాయణపురం జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్డీవో చిన్నికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, హౌసింగ్ అధికారులు, పాల్గొన్నారు. అంతకుముందు అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీవో సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

కశింకోట: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం)లో శనివారం ఆమె పర్యటించారు. అక్కడ వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారు వెంటనే పనులు ప్రారంభించాలని, లేదంటే మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి వేరొకరికి కేటాయిస్తారని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఎ.ఖాన్, హౌసింగ్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెం అంగన్‌వాడీ పనితీరు భేష్



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీపీ

అనకాపల్లిటౌన్: మండలంలో మామిడిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మిగతా అంగన్‌వాడీలు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. ఆ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీపీ సందర్శించారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని రుచి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులతో గేయాలు పాడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ఎన్నో అంగన్‌వాడీలను సందర్శించానని, వాటిన్నింటి కన్నా ఈ అంగన్‌వాడీ కేంద్రం పనితీరు బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బంధం అప్పలనాయుడు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సేనాపతి హరికృష్ణ పాల్గొన్నారు.

రైలు ప్రమాదం బాధాకరం



మాట్లాడుతున్న గంగాధర్

తుమ్మపాల: ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ఎక్కువ మంది మృతిచెందడంత బాధాకరమని నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు, న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ తెలిపారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైతిక బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలన్నారు. మృతులకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జన్‌భాగిధారితో పాఠ్యాంశాలపై పట్టు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం నారాయణరావు

అనకాపల్లిటౌన్: జన్‌భాగిధారి కార్యక్రమం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధించవచ్చని కొత్తతలారివానిపాలెం హెచ్‌ఎం రెడ్డి నారాయణరావు అన్నారు. పాఠశాల ఆవరణలో శనివారం జన్‌భాగిధారి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యం వృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయనున్నామన్నారు. అంతకుముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించాలి



అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు

యలమంచిలి : విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కొక్కిరాపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ అన్నారు. శనివారం కొక్కిరాపల్లి పాఠశాలలో భాషా గణితంలో పునాది అభ్యసనా సంకల్పయాత్ర–ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బొడ్డేడ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత, తెలుగు భాషా సామర్థ్యాలు పెంపొందించాలని విద్యార్థులతో ప్రయోగాత్మక విద్యను, నీతికథలతో కూడిన బోధన చేపట్టడం జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ పాలెరౌతు నర్సింగరావు, ఉపాధ్యాయులు సుజాత,ఆర్.కె.వి.రమణ, ప్రసాదరావు, అనూష,అన్నపూర్ణ, అమ్మోజీ పాల్గొన్నారు.

ఎస్కలేటర్‌కు మరమ్మతులు చేయాలి



అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో పనిచేయని ఎస్కలేటర్

తుమ్మపాల:అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పనిచేయని ఎస్కలేటర్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ (హ్యూమన్ రైట్స్) జిల్లా ప్రెసిడెంట్ కోరుబిల్లి పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్‌ను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్ బెల్టు తెగి ఆరునెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్టేషన్‌లో ఉన్న మరుగుదొడ్డిని కనీసం శుభ్రం చేయడం లేదని తెలిపారు. స్థానిక ఎంపీ, మంత్రి తక్షణమే స్పందించి అధికారులపై వత్తిడి తేవాలని కోరారు.